క్లుప్తంగా

సీఎంను కలిసిన తిరుపతి



ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కామిరెడ్డి తిరుపతి సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందించారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో పార్టీ ప్రభావం తదితర విషయాలపై చర్చించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నారు.

పెద్ద సేవలు రద్దు

వేములవాడ: రాజన్న ఆలయంలో కొనసాగుతున్న శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరగాల్సిన పెద్ద సేవలను వాతావరణం అనుకూలించకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. దీంతో ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రెండ్రోజులు నాటక ప్రదర్శన

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్ పద్మశాలీ సంఘం వద్ద శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నాటక కళామండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహించినట్లు నిర్వాహకులు పుప్పాల దేవయ్య, శ్రీనివాస్ చారి, దుర్గయ్య చారి తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఆదివారం, సోమవారం, రెండ్రోజుల నిర్వహించే కార్యక్రమంలో వీర బ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ద్వారా తెలపనున్నట్లు తెలిపారు. భక్తులు ప్రదర్శన కు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

ఎల్లారెడ్డిపేట: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా మళ్లీ బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి అన్నారు. కరీంనగర్‌లో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గం బూత్ విజయ సంకల్ప అభియాన్ సభకు మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. అవినీతి రహితపాలన కేవలం మోదీకే సాధ్యమవుతుందన్నారు. తరలివెళ్లిన వారిలో నాయకులు కిష్టారెడ్డి, దాసు, రవి, వేణు, సంజీవరెడ్డి, వంగల శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్య, లింబయ్య, శ్రీను తదితరులున్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా భిక్షపతి

ముస్తాబాద్: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నారని కూర భిక్షపతి తెలిపారు. వాసవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన మండల సమావేశంలో సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన లింబయ్యగారి సంజీవరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటియాదవ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ దయాకర్‌రావు, హన్మంతరెడ్డి, నాయకులు గంధ్యాడపు రాజు, లక్ష్మణ్, బండ రమేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల: సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్‌లో ఇటీవల ఆత్మహత్యకు చేసుకున్న నేత కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా నేత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు వైద్యశివప్రసాద్, మ్యాన రవి, రాము, ఎదురుగట్ల అంజయ్యగౌడ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన ఎల్ల ప్రమీల ఏడాదిక్రితం తల్లిదండ్రులను కోల్పోయింది. నిరుపేద కుటుంబం కావడంతో ఆమె వివాహానికి మండలంలోని 2000–01 పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందించారు. గడప వేణు, అల్లూరి గంగారెడ్డి, నరేశ్, లక్ష్మణ్, అనిల్, పవన్, శ్రీనివాస్, తదితరులున్నారు.

వేసవికాలం.. కాటన్ చల్లదనం

- సమ్మర్ ట్రెండ్‌గా అమ్మకాలు
- సిరిసిల్లలో ఈ దుస్తులకు డిమాండ్
- అన్ని షాపింగ్‌మాల్స్‌లో విక్రయాలు

సిరిసిల్లటౌన్: మండుటెండల్లో శరీరానికి చల్లదనం ఇచ్చేలా.. ఒంటికి ధరిస్తే నప్పేలా వేడి వాతావరణాన్ని తట్టుకునేందుకు కాటన్ దుస్తులకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో కాటన్ మినహా ఇతర దుస్తులు ధరించేందుకు జనాలు వెనుకాడుతున్నారు. తక్కువ ధరకే అందమైన డిజైన్లలో దొరికే కాటన్ వస్త్రాలు పట్టణంలో విరివిగా విక్రయిస్తున్నారు. పట్టణంలో కాటన్ వస్త్రాల ట్రెండ్‌పై సండే స్పెషల్ కథనం..



సండే స్పెషల్

వేడిమి నుంచి రక్షణగా

పట్టణంలో ఏ షాపింగ్ మాల్ చూసినా బట్టల దుకాణాలు, రెడీమేడ్ దుకాణాల్లో కాటన్ వస్త్రాల కొనుగోళ్ల సందడి నెలకొంది. పత్తినుంచి సహజ సిద్ధంగా తయారయ్యే కాటన్ దారం నుంచి నేయడంతో ఈదుస్తులు శరీరాన్ని వేడిమి నుంచి రక్షిస్తాయని తెలుపుతున్నారు. వేసవి కావడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో కాటన్ దుస్తులు ధరిస్తూ ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.


మహిళలకు ప్రత్యేక డిజైన్లలో

మార్కెట్‌లో మహిళలకు ప్రత్యేక డిజైన్లలో డ్రెస్సులు, శారీస్, మిడ్డీస్, పెట్టీకోట్స్, నైటీస్, చుడీదార్స్, కాటన్ శారీస్ తదితరాలు అందుబాటులో ఉన్నాయి. గృహిణులు, ఉద్యోగులు, డాక్టర్స్, లాయర్స్ వంటి ప్రొఫెషనల్స్ కూడా కాటన్ వస్త్రాలు ధరిస్తున్నారు. పట్టణంలోని వ్యాపారులు ఇతర నగరాలు, పట్టణాల నుంచి మహిళలు వేసవిలో ఎక్కువగా ఇష్టపడే కాటన్ వస్త్రాల్లో సరికొత్త డిజైన్లలో డ్రెస్సులు, చీరలు అమ్ముతున్నారు. సమ్మర్ స్పెషల్ ఆఫర్లలో పది నుంచి యాభైశాతం వరకు డిస్కౌంట్ సేల్స్ నడుస్తున్నాయి. షాపింగ్ మాల్స్‌లో సైతం వన్ ప్లస్ వన్ ఆఫర్లతో అమ్మకాలు సాగిస్తున్నారు.

ఖాదీ దుస్తులకు డిమాండ్

పట్టణంలో చేనేత వస్త్రాలైన ఖాదీ దుస్తులకు డిమాండ్ పెరిగింది. సిరిసిల్ల, కరీంనగర్, మెట్‌పల్లి పట్టణాలు, చుట్టుపక్కల గ్రామాల్లో నేసే కాటన్ వస్త్రాలపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. షాపింగ్ మాల్స్ మొదలు చిన్న వ్యాపార దుకాణాల్లో సైతం కాటన్ దుస్తులు అమ్ముతున్నారు. షాపింగ్ మాల్స్‌లో హైదరాబాద్, ముంబై, భీవండి, ఢిల్లీ, కలకత్తా, గద్వాల తదితర ప్రాంతాల నుంచి కాటన్ వస్త్రాలు తెప్పించి వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు కాటన్ వస్త్రాలను కాలనీల్లో బైక్‌లు, సైకిల్‌పై అమ్ముతూ మొబైల్ ఉపాధి పొందుతున్నారు. మగవారి డ్రెస్ (ప్యాంట్, షర్ట్) రూ. 300 మొదలు రూ. 4000 వరకు, మహిళలకు రూ. 200 మొదలుకుని రూ.5,000 వరకు చీరలు, మహిళల డ్రెస్సులు కూడా రూ. 500 మొదలుకొని రూ. 4,300 వరకు ధరల్లో కాటన్ దుస్తులు అమ్ముతున్నారు.

అన్ని వెరైటీల్లో



వేసవి వచ్చిందంటే కాటన్ దుస్తులే ఎక్కువగా అమ్ముతుంటారు. కరీంనగర్ చుట్టుపక్కల గ్రామాల్లో నేసే చేనేత ఉత్పత్తులను ఎక్కువగా విక్రయిస్తున్నాం. మావద్ద అన్ని వెరైటీల్లో కాటన్ డ్రెస్సులు, చీరలు, షర్ట్స్, ప్యాంట్స్, దోతిలు, లుంగీలు, టవల్స్ అందుబాటులో ఉన్నాయి. రూ.200 నుంచి రూ. 2000 వరకు ధరల్లో అమ్ముతున్నాం.

– మంచాల లావణ్య, శారీస్ వ్యాపారి

మండుటెండలో చల్లగా



కాటన్ దుస్తులతో శరీరానికి అనుకూలంగా ఫ్యాషన్‌గా ఉంది. మార్కెట్లోకి ఎన్నో రకాల కాటన్ దుస్తులు వస్తున్నాయి. లెనిన్, ఆర్గానిక్, పాప్లీన్, ఆరగండి, ఖద్దర్ తదితర రకాలున్నాయి. ఇవి ధరిస్తే సాధారణ రోజుల్లోనూ ప్రత్యేకంగా కనిపిస్తారు. ఫంక్షన్లకు కాటన్ దుస్తులు వేసుకోవడం సౌకర్యంగా ఉంటుంది.

– శారద, ప్రధానోపాధ్యాయురాలు, సిరిసిల్ల

హుందాతనంగా ఉంటాయి



కాటన్ వస్త్రాలు ధరిస్తే హుందాతనంగా ఉంటాయి. వేసవిలో తేలికైన రంగుల్లో ఉండే కాటన్ వస్త్రాలు ధరిస్తే మరింత బాగుంటుంది. ఫంక్షన్లు, ప్రయాణాల్లో కూడా కాటన్ దుస్తులు సౌకర్యవంతంగా ఉంటాయి. వీటి ధరకూడా తక్కువ. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కాటన్ దుస్తుల ధరించేందుకు ఆడ, మగవారు ఇష్టపడుతున్నారు.

– కోడం శ్రీదేవి, గృహిణి, సిరిసిల్ల

మందుబాబులకు అడ్డాగా..



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం పాఠశాల ఆవరణలో రాత్రిపూట మద్యం తాగుతున్నారు. ఉదయం విద్యార్థులు పాఠశాలకు రాగానే ఖాళీ మందుసీసాలు దర్శనం ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్చి పారేసిన సిగరేట్ డబ్బాలు సైతం కనిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు శనివారం వ్యక్తిత్వ వికాసంపై పరీక్ష నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'షీరో' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. పరీక్షలను ఐసీడీఎస్ సీడీపీవో అలేఖ్య పటేల్, సూపర్‌వైజర్ పద్మజ పర్యవేక్షించారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి



తంగళ్లపల్లి: నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లటౌన్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు పోతుగంటి రమేశ్, లక్ష్మీరాజం, విష్ణు, పద్మారెడ్డి, శైలజ, శ్రీలత, భ్రమరాంబిక, వైష్ణవి, సుప్రియ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ రజిని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాణిశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో ఓ ఇంట్లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారనే సమాచారంతో శనివారం రాత్రి పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఏఎస్సై కిషన్‌రావు తెలిపిన వివరాలు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన మహేశ్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి రెండు కాటన్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం స్వాధీనం చేసుకొని మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- నారాయణపూర్‌లో 15 నుంచి వేడుకలు
- 17న శ్రీసీతారాముల కల్యాణం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో వారంరోజుల పాటు శ్రీ సీతారామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. గ్రామంలో వివిధ పూజ కార్యక్రమాలు ప్రారంభించారు. వేడుకలకు గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల వారు తరలిరానున్నారు. చివరి రోజు నిర్వహించే రథోత్సవం అంగరంగ వైభవంగా సాగనుంది. ఈ వేడుకలను వేములవాడ రాజన్న దత్తత అయిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 15 నుంచి 20 వరకు వేడుకల నిర్వహణకు స్వామివారి ఆలయాన్ని ముస్తాబు చేశారు.



శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

500 ఏళ్ల చరిత్ర

నారాయణపూర్‌లోని శ్రీ సీతారామాలయం 500 ఏళ్ల క్రితం వెలసినట్లు స్థలపురాణం చెబుతోంది. కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఇక్కడి రామాలయంలోని ఉత్సవమూర్తులు భద్రాచలంలోని విగ్రహాలే వలే ఉంటాయి. ఆలయ భూముల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు వేములవాడ రాజన్న ఆలయం ద్వారా వచ్చే నిధులతో ఈ ఆలయ నిర్వహణ కొనసాగుతోంది. 15న ఉదయం 9 గంటలకు ఆలయ సంప్రోక్షణ, నవకలశ స్థాపన, తిరుమంజనం, అలంకరణ, నివేదన, తీర్థప్రసాద వితరణ.16న సేవాకాలం, నివేదన, ధ్వజారోహణం, కాత్సుముర్రై, సాయంత్రం దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద వితరణ. 17న 9 గంటలకు నిత్యహవనం, బలిహరణం, 11 గంటలకు స్వామివారి ఎదుర్కోలు, 11.45 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారి ఊరేగింపు, కల్యాణం లడ్డూకు వేలంపాట. 18న ఉదయం నిత్యహవనం, తీర్థగోష్ఠి, వేద సదస్సు, బలిహరణం, సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు. 19 గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు. 20న రథపుణ్యవచనం, రథహోమం, రథబలి, ఉదయం 7 గంటలకు రథంపై స్వామి వారి ఊరేగింపు, రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో రాచర్ల కోటలోని శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో యజ్ఞం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడు వంగల రవీందర్–లత, వంగల విశాల్–రచన, జనగామ చంద్రశేఖర్–భాగ్య, మోడ్సు సాయిరెడ్డి–రేణుక, విష్ణువర్ధన్‌రెడ్డి–సౌమ్య దంపతులు యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. వంగల రవీందర్ భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య,నర్సి లక్ష్మారెడ్డి,గౌస్, నంది కిషన్, గ్రామస్తులు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాల బాల్‌రెడ్డి, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, రామ భీమేశ్వర్, సత్యం, రాజయ్య కృష్ణ, హనుమాన్ మాలదారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



గంభీరావుపేట : స్వామివారిని దర్శించుకుంటున్న కొండూరు రవీందర్‌రావు, నాయకులు

గంభీరావుపేట: మండలంలోని కోళ్లమద్ది భక్తాంజనేయ ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ ఏనుగు కేశవరావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్, నాయకులు వెంకటస్వామిగౌడ్, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, రాజు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.



ముస్తాబాద్ : పూజలు చేస్తున్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో శ్రీ వీరాంజనేయ ఆలయంలో శ్రీలక్ష్మి వరసిద్ధి గణపతి సహిత ఆదిత్యాది నవగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రాణప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహస్థాపన, బలిహరణం, పూర్ణాహుతి నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పీచర ఆశోక్‌రావు అన్నదానం చేశారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ సర్పంచులు గౌతంరావు, పండరి, ఆలయ కమిటీ చైర్మన్ గోద శ్రీనివాస్, ద్యావతి అంజయ్య, తోట ధర్మేందర్, మైసగౌడ్, బండ అంజయ్య, పారిపెల్లి శ్రీనివాస్, చెక్కపల్లి రాజు, భాను తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కోనరావుపేట: మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం గీతాభవాని, ఉపాధ్యాయులు శారదావాణి, రవీందర్, తిరుపతి, అజ్మీరా రాజు, శ్యామల, ఊర్మిళ, మదన్‌లాల్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల సేకరణ

- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చందాల పోగు
- రూ.30లక్షల కంట్రిబ్యూషన్ కోసం గ్రామస్తుల సాయం



విరాళాలు అందిస్తున్న దాతలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ ఆలయం నుంచి ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో ఆరునెలలక్రితం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారు. అందుకు ఆలయం తరఫున రూ. 30లక్షల కంట్రిబ్యూషన్ చెల్లించాల్సి ఉంటుంది. కంట్రిబ్యూషన్ చెల్లించేందుకు ఎవరు ముందుకురాకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు, పలువురి ప్రముఖుల ద్వారా చందాలు పోగుచేయాలని నిర్ణయించారు. శనివారం విరాళాలు పోగు చేసేందుకు ముందుగా గ్రామంలో తిరిగారు. మొదటి రోజు రూ.లక్ష విరాళం సేకరించారు. గ్రామానికి చెందిన సేపూరి సౌజన్యరెడ్డి రూ.50 వేలు, ముప్పవరం ప్రభాకర్‌రావు రూ.10,116తో పాటు ఒకేరోజు దాతలు రూ.లక్ష అందించారు. ఆలయ కమిటీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు, ఇతరుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. వచ్చిన నగదుతో రూ.30 లక్షల కంట్రిబ్యూషన్ చెల్లించి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ వెంకటేశ్ గౌడ్ తెలిపారు.

'శ్రీపాదరావు'కు నివాళి



ముస్తాబాద్: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని శనివారం సిరిసిల్లలోని డీసీసీ, కేకే మహేందర్‌రెడ్డి కార్యాలయంలో వేర్వేరుగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, మ్యాన ప్రసాద్, వైద్య శివప్రసాద్, కౌన్సిలర్లు వేముల రవి, రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వనిత, శ్రీదేవి, కల్లూరి చందన, రమాదేవి, శరణ్య, చిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఇక్కడ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, కొండం రాజిరెడ్డి, శీల ప్రశాంత్, వుచ్చిడి బాల్‌రెడ్డి, రాంరెడ్డి, అన్నం శ్రీధర్‌రెడ్డి, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు



కోనరావుపేట: మండలంలోని రాజన్న గొల్లపల్లి (కొలనూర్)లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఎండిపోతుంది. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నిర్మించిన పల్లె ప్రకృతి వనంలో ఉపాధి హామీ ద్వారా మొక్కలు నాటారు. ప్రకృతి వనాన్ని పట్టించుకోకపోవడంతో మొక్కలన్నీ ఎండిపోయాయి.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట: ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన తాటిపల్లి పర్శరాములు గతనెలలో తన సెల్‌ఫోన్ పోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి అప్పగించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. నాలుగునెలల్లో 53 సెల్‌ఫోన్లు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.